సాక్షి విశాఖపట్నం

సోమవారం। 17। జూన్। 2024.



అద్దాల్లో చిలుకలు 8లో



ఆరోగ్యానికి రేడు.. నేరేడు 8లో



దివ్యాంగులతో 'తండేల్' ముచ్చట్లు 8లో

న్యూస్‌రీల్

రక్తదానంపై అపోహలు వద్దు

జేసీ మయూర్ అశోక్



రక్తదాతకు ప్రశంసాపత్రం అందజేస్తున్న జేసీ మయూర్ అశోక్

మహారాణిపేట: ప్రపంచ రక్తదాతల దినోత్సవం పురస్కరించుకుని ఆదివారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీలో ఘనంగా వేడుకలు జరిగాయి. సొసైటీ చైర్మన్ డాక్టర్ వై.శివనాగేంద్రరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ రక్తదాతలు, రక్తదాన శిబిరాల నిర్వాహకులను సన్మానించారు. ఈ సందర్భంగా జేసీ రక్తదాన విశిష్టతను వివరించారు. సురక్షితమైన రక్తదానం వల్ల దాతకు కూడా ప్రయోజనం చేకూరుతుందన్నారు. అపోహలు వీడి రక్తదానం చేయడానికి ఎల్లప్పుడూ ముందుండాలని పిలుపునిచ్చారు. రక్తదాతలు, రక్తదాన శిబిరాల నిర్వాహకులను అభినందించారు. అంతకుముందు రెడ్‌క్రాస్ వ్యవస్థాపకుడు హెన్రీ డునాంట్, మొదటిసారిగా రక్తవర్గాలను కనుగొన్న కార్ల్ ల్యాండ్ స్టీనర్ చిత్రపటాలకు నివాళులర్పించారు. రౌండ్ టేబుల్ ఇండియా ఏరియా 9 చైర్మన్ విక్రాంత్ హనుమంతు, ఏరియా 213 చైర్మన్ కొవ్వూరి గంగిరెడ్డి, రెడ్‌క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

మూడో విడత చందనం అరగదీత ప్రారంభం



చందనాన్ని అరగదీస్తున్న సిబ్బంది

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఆదివారం నుంచి మూడో విడత చందనం అరగదీత ఘనంగా ప్రారంభమైంది. ఈనెల 22న జ్యేష్ట పౌర్ణమిని పురస్కరించుకుని ఆరోజు స్వామికి సమర్పించే మూడు మణుగుల (120 కిలోలు) పచ్చిచందనం సమకూర్చేందుకు ఈ అరగదీత కార్యక్రమాన్ని చేపట్టారు. ఉదయం ఏడు గంటల నుంచి 15 మంది నాల్గవ తరగతి సిబ్బంది చందనం అరగదీతను ప్రారంభించారు. తొలిరోజు ఆదివారం 35 కిలోల చందనాన్ని అరగదీశారు. ఇంకా మూడు రోజులపాటు చందనం అరగదీత కార్యక్రమం జరగనుంది. కాగా ఏడాదిలో శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి నాలుగు విడతలుగా మూడేసి మణుగుల పచ్చి చందనాన్ని సమర్పిస్తారు. చందనోత్సవం నాడు రాత్రి, వైశాఖ పౌర్ణమి, జ్యేష్ట పౌర్ణమి, ఆషాఢ పౌర్ణమి రోజుల్లో తెల్లవారుజామున మూడేసి మణుగుల చొప్పున చందనాన్ని సమర్పిస్తారు. ఇప్పటికే గడిచిన చందనోత్సవం రోజు, వైశాఖ పౌర్ణమి రోజు రెండు విడతలు చందనం సమర్పణ పూర్తయింది.

రేపు సాయంత్రం 6 గంటల వరకే అప్పన్న దర్శనాలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దర్శనాలు మంగళవారం సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే లభిస్తాయని దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. స్వామివారి సోదరి, అడవివరం గ్రామ దేవత పైడితల్లి అమ్మవారి పండగ మంగళవారం జరగనుండడంతో ఈ మార్పు చేసినట్టు పేర్కొన్నారు.

విశాఖ- సంత్రగచ్చి మధ్య ప్రత్యేక రైళ్లు

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం-సంత్రగచ్చి మధ్య ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ తెలిపారు.

- విశాఖపట్నం-సంత్రగచ్చి(08502) స్పెషల్ ఈ నెల 19, 21, 26, 28వ తేదీల్లో రాత్రి 11.45 గంటలకు బయలుదేరి మరుసటిరోజు మధ్యాహ్నం 3.25 గంటలకు సంత్రగచ్చి చేరుకుంటుంది. సంత్రగచ్చి-విశాఖపట్నం(08501) స్పెషల్ ఈ నెల 20, 22, 27, 29వ తేదీల్లో సంత్రగచ్చిలో సాయంత్రం 5 గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 8.30 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది.
- విశాఖపట్నం-సంత్రగచ్చి(08506) స్పెషల్ ఈ నెల 17, 22, 24, 29వ తేదీల్లో రాత్రి 11.45 గంటలకు బయలుదేరి మరుసటిరోజు మధ్యాహ్నం 3.25 గంటలకు సంత్రగచ్చి చేరుకుంటుంది. సంత్రగచ్చి-విశాఖపట్నం(08505) స్పెషల్ ఈ నెల 18, 23, 25, 30వ తేదీల్లో సంత్రగచ్చిలో సాయంత్రం 5 గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 8.30 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ స్పెషల్ విజయనగరం, శ్రీకాకుళం రోడ్, పలాస, బ్రహ్మపూర్, ఖుర్దా రోడ్, భువనేశ్వర్, కటక్, భద్రక్, బాలాసోర్, ఖరగ్‌పూర్ స్టేషన్లలో ఆగుతుంది.



● జనసంద్రం

నగరంలోని ఆర్.కె.బీచ్, సాగర్‌నగర్, రుషికొండ, భీమిలి, యారాడ తదితర బీచ్‌లకు ఆదివారం సందర్శకులు పోటెత్తారు. నగర ప్రజలు కుటుంబాల సమేతంగా కదలివచ్చి సందడి చేశారు. బీచ్‌రోడ్డు వాహనాలతో నిండిపోయింది. సాగరతీరంలో పిల్లలు ఆటలాడుకుంటూ.. యువతీ యువకులు సెల్ఫీలు తీసుకుంటూ.. స్నానాలు చేస్తూ ఎంజాయ్ చేశారు. తీరంలో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా పోలీసులు, లైఫ్‌గార్డ్స్ నిరంతరం సూచనలు, హెచ్చరికలు జారీ చేశారు.

– బీచ్‌రోడ్డు



సరకు రవాణాలో ఆర్టీసీ దూకుడు!

- జోన్-1లో గతేడాది కంటే 5 శాతం పెరిగిన ఆదాయం
- మరింత మంది పార్శిల్ బుకింగ్ ఏజెంట్ల నియామకం



ద్వారకా బస్‌స్టేషన్‌లో పార్శిల్ రవాణా కార్యాలయం

సాక్షి, విశాఖపట్నం : సరకు (కార్గో) రవాణాలో ఆర్టీసీ జోన్-1 దూకుడు ప్రదర్శిస్తోంది. రాష్ట్రంలోని ఇతర జోన్లకంటే ముందుంది. గతేడాది కంటే ఐదు శాతం ఆదాయాన్ని అధికంగా ఆర్జించి రాష్ట్రంలో మొదటి స్థానంలో కొనసాగుతోంది. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలు ఈ జోన్ పరిధిలో ఉన్నాయి. సరకు రవాణా ద్వారా ఈ జోన్‌కు గత ఏడాది ఏప్రిల్ నుంచి జూన్ 15వ తేదీ వరకు రూ.4.72 కోట్ల ఆదాయం సమకూరింది. ఈ ఏడాది అదే కాలానికి రూ.4.96 కోట్లను ఆర్జించింది. అంటే ఇది గతేడాదికన్నా ఐదు శాతం అధికమన్న మాట! ఇక జిల్లాల వారీగా పెరిగిన కార్గో ఆదాయాన్ని పరిశీలిస్తే అత్యధికంగా శ్రీకాకుళం జిల్లా 17 శాతం, అల్లూరి సీతారామరాజు 16, అనకాపల్లి 8, విజయనగరం 6, విశాఖపట్నం 1, పార్వతీపురం మన్యం 1 శాతం చొప్పున ఉంది. వీటిలో పంటల విత్తనాలు, పాఠ్య, నోట్ పుస్తకాలను కంటైనర్ కార్గో, డిపో గూడ్స్ ట్రాన్స్‌పోర్టు (డీజీటీ) వాహనాల్లో రవాణా ద్వారా అధిక మొత్తం లభించింది.

ఇంకా ఉత్తరాంధ్ర నుంచి హైదరాబాద్ సహా తెలుగు రాష్ట్రాల్లోని మరికొన్ని ప్రాంతాలకు జీడిపప్పు, గోధుమపిండి, ప్లేవుడ్ వంటివి రవాణా చేస్తున్నారు. అలాగే హైదరాబాద్ నుంచి ఇక్కడకు బుక్ చేసే సరకుల్లో బిస్కట్లు, ఆటోమొబైల్ స్పేర్ పార్టులు వంటివి ఉంటున్నాయి. ఇప్పటికే చాలావరకు పాఠశాలలకు ప్రభుత్వ పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్కులను ఆర్టీసీ లాజిస్టిక్స్ వాహనాల్లో రవాణా చేశారు. ఇంకా మిగిలి ఉన్న కొన్ని చోట్లకు త్వరలోనే పూర్తి చేయనున్నారు. ఖరీఫ్ సీజన్ మొదలు కానుండడంతో రైతులకు అవసరమైన వివిధ రకాల విత్తనాలను ఆయా గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల (ఆర్బీకే)లకు తరలిస్తున్నారు. ఇలా నెలాఖరు వరకు వీటిని రవాణా చేయవచ్చని అధికారులు భావిస్తున్నారు.

డీఎంఈలతో సమావేశం

డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ (డీఎంఈ)లకు మీటింగ్ పెట్టి జోన్‌లో పార్శిల్ బుకింగ్‌లు మరింతగా పెంచేందుకు ఆర్టీసీ కార్గో సేవల విభాగం అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇందుకోసం డీఎంఈలతో వీరు ఇటీవల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. జోన్ పరిధిలో పార్శిల్ బుకింగ్‌లను మరింత విస్తృతం చేయాలని, ఫిర్యాదులను తక్షణమే పరిష్కరిస్తూ ముందుకెళ్లాలని, వినియోగదార్లకు సేవల ద్వారా చేరువ కావాలని సూచించారు.

మండలానికో ఏజెంట్



సరకు రవాణా ఆదాయంలో రాష్ట్రంలో కెల్లా జోన్-1 నంబరు వన్ స్థానంలో ఉంది. గత ఏడాది కంటే ఐదు శాతం పెరుగుదలతో అగ్రస్థానంలో నిలిచింది. ఆర్టీసీ కార్గో రవాణా వ్యవస్థను మరింతగా మెరుగు పరచడం ద్వారా ఆదాయాన్ని పెంచాలని యోచిస్తున్నాం. ప్రస్తుతం జోన్‌లో ఆథరైజ్డ్ పార్శిల్ బుకింగ్ (ఏపీబీ) ఏజెంట్లు 52 మంది ఉన్నారు. నెల రోజుల్లో వీరి సంఖ్యను 62కి పెంచనున్నాం. భవిష్యత్తులో మండలానికో ఏపీబీ ఏజెంట్ చొప్పున విధిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని భావిస్తున్నాం. ఏపీబీ ఏజెన్సీ కోసం సిటీ పరిధిలో అయితే రూ.5 వేలు, రూరల్‌లో రూ. వెయ్యి మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది. ఆసక్తి ఉన్న వారు సమీపంలో డిపో అధికారులను సంప్రదిస్తే సరిపోతుంది.

– బలిజి అప్పలనాయుడు, డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్

అప్పుడే మొదలెట్టేశారు

- తాళ్లవలసలో ప్రభుత్వ భూమి కబ్జా
- గెడ్డను ఆక్రమించిన నారాయణ విద్యా సంస్థలు



తాళ్లవలసలో నారాయణ విద్యాసంస్థలు గెడ్డను కప్పి నిర్మిస్తున్న షెడ్లు

తగరపువలస: కూటమి అధికారంలోకి వచ్చి.. ఎమ్మెల్యేలు ఇంకా ప్రమాణ స్వీకారం చేయకముందే భీమిలిలో ప్రభుత్వ భూముల కబ్జాకు తెరతీశారు. సాక్షాత్తూ పురపాలక శాఖ మంత్రి పి.నారాయణకు చెందిన తాళ్లవలసలోని నారాయణ విద్యా సంస్థలకు ఆనుకుని ఉన్న గెడ్డను పూడ్చి దర్జాగా షెడ్లు నిర్మిస్తున్నారు. స్థానికులు ఈ కబ్జాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. దీనిని అడ్డుకోవాల్సిన రెవెన్యూ, స్థానిక సచివాలయ సిబ్బంది పెద్దవారితో మనకెందుకు అని వారిస్తున్నట్టు ఆరోపిస్తున్నారు. విద్యాసంస్థల ప్రతినిధులు రెండు వారాలుగా గెడ్డను పూడ్చి షెడ్లు నిర్మిస్తున్నా అధికారులు కినుక వహిస్తుండటంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ కబ్జా విషయాన్ని వైఎస్సార్ సీపీ పంచాయతీ నాయకులు ఆదివారం సాయంత్రం రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకురాగా సోమవారం పరిశీలించి చర్యలు తీసుకుంటామని ధీమాగా చెప్పారు. ఆక్రమణకు గురైన స్థలం వివరాలు, సర్వే నంబర్ అప్పుడే చెబుతామని దాటవేశారు.

● ఈద్ ముబారక్



త్యాగానికి ప్రతీకైన బక్రీద్‌ను సోమవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించేందుకు ముస్లింలు సిద్ధమయ్యారు. ఈద్గాలతో పాటు మసీదుల్లోనూ నమాజ్ కోసం ఏర్పాట్లు పూర్తి చేశారు. పండగ నేపథ్యంలో ఈద్గాలు, మసీదులను విద్యుత్ కాంతులతో సిద్ధం చేశారు. సర్వ మానవాళి కోసం మత పెద్దలు దువా చేయనున్నారు.

ప్రశాంతంగా యూపీఎస్సీ ప్రిలిమినరీ పరీక్ష



కృష్ణా కాలేజీలో పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలిస్తున్న కలెక్టర్ మల్లికార్జున






ప్రభుత్వ మహిళా జూనియర్ కాలేజీలో పరీక్ష రాసి బయటకు వస్తున్న అభ్యర్థులు

మహారాణిపేట : నగరంలో ఆదివారం నిర్వహించిన యూపీఎస్సీ ప్రిలిమినరీ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. జిల్లా వ్యాప్తంగా 26 కేంద్రాల్లో పరీక్ష జరగ్గా సంబంధిత ఏర్పాట్లను కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున పర్యవేక్షించారు. కృష్ణా కాలేజీ, ఎంవీపీ కాలనీలోని గాయత్రి కాలేజీల్లో ఏర్పాటు చేసిన కేంద్రాలను కలెక్టర్ తనిఖీ చేశారు. పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలించారు. ప్రిలిమినరీ పరీక్షకు మొత్తం 9,735 మంది దరఖాస్తు చేసుకోగా 4,677 మంది హాజరయ్యారు. జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్‌కుమార్, లైజన్ అధికారులు, ఇతర అధికారులు పరీక్ష నిర్వహణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కైలాసగిరిపై చురుగ్గా మ్యూజియం పనులు



సైన్స్ మ్యూజియం కోసం జరుగుతున్న పనులు

ఆరిలోవ: ప్రముఖ పర్యాటక కేంద్రం కైలాసగిరిపై సైన్స్ మ్యూజియం పనులు కొనసాగుతున్నాయి. ఈ ఏడాది జనవరి 2న మ్యూజియం నిర్మాణం పనులు ప్రారంభించారు. కొద్ది రోజుల పాటు చకచకా సాగిన పనులు.. మధ్యలో నిలిచిపోయాయి. మళ్లీ ఇటీవల పనులు ప్రారంభించారు. రాష్ట్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం కలసి మ్యూజియం గ్రాంట్ స్కీం కింద సైన్స్ సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (ఎస్‌సీఏపీ) ఆధ్వర్యంలో ఇక్కడ అధునాతనమైన సైన్స్ అండ్ టెక్నాలజీ మ్యూజియం ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకోసం రూ 4.69 కోట్లు నిధులు ఖర్చు చేస్తున్నారు. రూ 3.75 కోట్ల నిధులను ఎస్‌సీఏపీకి సాంస్కృతిక మంత్రిత్వ శాఖ కేటాయించగా మిగిలిన రూ.94 లక్షలు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. మ్యూజియం కోసం కైలాసగిరిపై సుమారు ఎకరం విస్తీర్ణం గల స్థలాన్ని వీఎంఆర్‌డీఏ కేటాయించింది. మ్యూజియంలో 3డీ ఆర్ట్ గ్యాలరీ, సిలికా విగ్రహాలు, సైన్స్ వర్కింగ్ సైన్స్ వర్కింగ్ మోడల్ ప్రదర్శనలు, శాస్త్రీయ థీమ్‌లు తదితరవి ఏర్పాటు చేయనున్నారు. ఏడాదిలో మ్యూజియం నిర్మాణం పూర్తి చేసి పర్యాటకులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు.

ఇంటర్ అడ్మిషన్ల జోష్

- పది ఫలితాల పెరుగుదలతో ఇంటర్ విద్యకు డిమాండ్
- ఈ నెల 30 వరకు రెండో విడత ప్రవేశాల గడువు
- ఉమ్మడి విశాఖ జిల్లాలో 366 జూనియర్ కాలేజీలు
- గతేడాది 58,944 మంది విద్యార్థులు చేరిక
- ఈ ఏడాది లక్ష్యం సాధించేలా పక్కా కార్యాచరణ



తరగతి గదిలో ఇంటర్మీడియట్ విద్యార్థులు



అడ్మిషన్ కోసం తల్లితో వచ్చిన విద్యార్థిని

విద్యా సంవత్సరం	బాలురు	బాలికలు	మొత్తం
2020-21	25,330	26,314	51,644
2021-22	27,306	28,196	55,502
2022-23	29,127	28,901	58,028
2023-24	29,306	29,638	58,944

విశాఖ విద్య : ఇంటర్మీడియెట్ విద్యకు క్రేజ్ పెరిగింది. ఈ ఏడాది పదో తరగతిలో మెరుగైన ఫలితాలు రావటంతో జూనియర్ కాలేజీల్లో చేరే విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది. దీంతో జూనియర్ కాలేజీలు విద్యార్థులతో కళకళలాడుతున్నాయి. విశాఖ జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పరిధిలో గల 182 కాలేజీలు ఉండగా అనకాపల్లి జిల్లాలో 143, అల్లూరిలోని 41 కాలేజీలు అందుబాటులో ఉన్నాయి. 2024-25 విద్యా సంవత్సరం ఈ నెల ఒకటి నుంచే ప్రారంభమైంది. అయితే పాఠశాలలు జూన్ 13న ప్రారంభం కావటంతో పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఇప్పుడిప్పుడే టీసీలను తీసుకొని కాలేజీల్లో చేరేందుకు వస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 30 వరకు డెడ్‌లైన్ పెట్టుకొని లక్ష్యం మేరకు అడ్మిషన్లపై ఫోకస్ పెట్టాలని ఇంటర్మీడియెట్ బోర్డు ఉన్నతాధికారులు ఆదేశించారు.

ప్రభుత్వ కాలేజీల్లో స్పీడు పెంచాల్సిందే..

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నాడు-నేడు కార్యక్రమంలో జూనియర్ కాలేజీలను అభివృద్ధి చేసి, మౌలిక వసతులు పెంపొందించింది. దీంతో ప్రభుత్వ జూనియర్ కాలేజీలకు క్రేజ్ పెరిగింది.

నగరంలోని జైల్ రోడ్‌లో గల బాలికల కాలేజీ, డాక్టర్ వీఎస్ కృష్ణా, భీమునిపట్నం, పెందుర్తి, అదే విధంగా అనకాపల్లి జిల్లాలోని యలమంచిలి, చోడవరం అదే విధంగా అల్లూరి జిల్లాలోని జి.మాడుగుల, పాడేరు, హుకుంపేట కాలేజీల్లో ప్రస్తుతం అడ్మిషన్లు బాగున్నాయి. మిగతా కాలేల్లో అడ్మిషన్లు అంతంత మాత్రమే ఉన్నట్లుగా తెలుస్తోంది. దీనిపై ఆయా జిల్లాల అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

విద్యార్థులకు 'ప్రైవేటు' గాలం

ఈ ఏడాది పదో తరగతిలో 90 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత కావటంతో జూనియర్ కాలేజీలకు డిమాండ్ పెరిగింది. దీంతో ప్రైవేటు కాలేజీల యాజమాన్యాల వారు సీట్లు నింపుకునేందుకు విద్యార్థుల కోసం గాలిస్తున్నారు. కాలేజీల్లోని అధ్యాపకులకు టార్గెట్‌లు పెట్టి మరీ అడ్మిషన్ల కోసం వేట సాగిస్తున్నారు. చాలా కాలేజీల్లో వేసవిలోనే ముందస్తు అడ్మిషన్లు చేయటంతో కొన్ని మండలాల్లో ప్రభుత్వ జూనియర్ కాలేజీలు, అదే విధంగా ప్లస్ టూ స్కూళ్లలో ఆశించిన స్థాయిలో విద్యార్థులు చేరని పరిస్థితులు ఉన్నాయి.

అడ్మిషన్లపై ప్రత్యేక దృష్టి



ఇంటర్మీడియెట్ అడ్మిషన్లపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం ప్రభుత్వ కాలేజీల్లో అందుబాటులో ఉన్న సీట్లన్నీ భర్తీ అయ్యేలా ప్రిన్సిపాల్స్ బాధ్యత తీసుకోవాలి. అడ్మిషన్ల వివరాలను సకాలంలో స్టూడెంట్ ఇన్ఫోలో నమోదు చేయాలి. విద్యార్థులంతా అడ్మిషన్ తీసుకునేలా వారి తల్లిదండ్రుల్లో అవగాహన కల్పించాలి. తరగతుల నిర్వహణపై దృష్టి పెట్టాలి.

–పి.మురళీధర్, ఆర్ఐవో, ఉమ్మడి విశాఖ జిల్లా

కాలేజీల వారీగా సమీక్ష చేస్తున్నాం



లక్ష్యం మేరకు అడ్మిషన్లు నిర్వహించేలా కాలేజీల వారీగా సమీక్ష చేస్తున్నాం. మా జిల్లాలోని 20 ప్రభుత్వ కాలేజీల్లో ఇప్పటివరకు 1,300 సీట్లు భర్తీ అయ్యాయి. టెన్త్ పాసైన విద్యార్థులకు కొన్ని చోట్ల టీసీలు తీసుకోవటంతో ఇబ్బందులు ఎదురవుతున్నట్లు తమ దృష్టికి వచ్చింది. అలాంటి వాటిపై కూడా దృష్టి సారించి, వారి సమస్య పరిష్కరించేలా శ్రద్ధ తీసుకుంటున్నాం.

– సుజాత, ఇంటర్ విద్యాధికారి, అనకాపల్లి జిల్లా

ప్రిన్సిపాళ్ల బాధ్యత తీసుకోవాలి



ప్రభుత్వ కాలేజీల్లో లక్ష్యం మేరకు సీట్ల భర్తీ అయ్యేలా తగిన కార్యాచరణతో ముందుకెళ్తున్నాం. టెన్త్ పాసైన ప్రతీ విద్యార్థి కాలేజీలో చేరేలా శ్రద్ధ తీసుకుంటున్నాం. దీనిపై జిల్లాలోని అన్ని కాలేజీలపై ప్రతీ రోజూ సమీక్షిస్తున్నాం. సబ్జెక్టు అధ్యాపకుల సమన్వయంతో అడ్మిషన్లపై దృష్టి సారించాలని ప్రిన్సిపాల్స్ ఆదేశించాం. మేము కూడా కాలేజీలను తరచూ పర్యవేక్షిస్తున్నాం.

– బి.రాధ, డీవీఈవో, విశాఖ జిల్లా

హక్కుల ఉల్లంఘనలపై దృష్టి సారించండి


కార్యక్రమంలో పాల్గొన్న ప్రొఫెసర్ వై.సత్యనారాయణ, శ్యాంప్రసాద్, కౌన్సిల్ సభ్యులు

సీతంపేట: గ్రామాల్లో కుల వివక్ష, మహిళల పట్ల వివక్ష, సామాజిక లింగ వివక్ష అంశాలపై దృష్టి సారించాలని దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీ ప్రథమ ఉప కులపతి ప్రొఫెసర్ వై.సత్యనారాయణ అన్నారు. మానవ హక్కుల కౌన్సిల్ వ్యవస్థాపక కార్యదర్శి మంత్రి శ్యాంప్రసాద్ అధ్యక్షతన స్థానిక పౌరగ్రంథాలయంలో మానవ హక్కులపై పలువురు రూపొందించిన లఘు చిత్రాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ సత్యనారాయణ మాట్లాడుతూ ఇప్పటికే గ్రామాల్లో హక్కుల ఉల్లంఘన జరుగుతోందని, సమాన న్యాయం జరిగినప్పుడే హక్కుల పరిరక్షణ సాధ్యమన్నారు. మంత్రి శ్యాంప్రసాద్ మాట్లాడుతూ సంస్థ సభ్యులంతా చట్టాలు, హక్కుల పట్ల అవగాహన కల్పించుకోవాలన్నారు. సమాజంలో ఉల్లంఘనలను గుర్తిస్తూ జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఎప్పటికప్పుడు ఫిర్యాదు చేయాలని సూచించారు. విశ్రాంత అడిషనల్ ఎస్పీ ఎస్.దివాకర్, వైజాగ్ ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు, సోషల్ మీడియా స్టేట్ చైర్మన్ సన్‌మూర్తి, విశాఖ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బెవర సత్యనారాయణ లఘు చిత్రాలను తిలకించి సమీక్షించారు. ప్రదర్శించిన మూడు లఘు చిత్రాలు జాతీయ హ్యూమన్ రైట్స్ కమిషన్ బహుమతులు పొందాయని శ్యాంప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిల్ సభ్యులు ఎస్వీ రమణ, డాక్టర్ వాసిని, వి.ఎస్.మూర్తి, సాగర్, అప్పారావు, అబ్దుల్, రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక విద్య పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి

- ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ


ఏపీటీఎఫ్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘువర్మ

మురళీనగర్: రాష్ట్రంలో ప్రాథమిక విద్య పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ పాలకలపాటి రఘువర్మ కోరారు. మాధవధార జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో ఆదివారం సాయంత్రం ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు చుక్కల కరుణాకర్ అధ్యక్షతన నిర్వహించిన ఏపీటీఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. 117 జీవో రద్దు చేసి మూడు, నాలుగు, ఐదు తరగతులను ప్రాథమిక పాఠశాలలో తిరిగి విలీనం చేయాలని తద్వారా ప్రాథమిక విద్యారంగాన్ని పరిరక్షించాలని కోరారు. ఉన్నత పాఠశాలల్లో ఆరు నుంచి పది తరగతుల వరకు తెలుగు, ఆంగ్ల మాధ్యమాలను సమాంతరంగా కొనసాగించి అందుకు తగిన నిష్పత్తిలో ఉపాధ్యాయులను నియమించాలన్నారు. రాష్ట్రంలోని అన్ని ఉన్నత పాఠశాలల్లోనూ సీబీఎస్సీ సిలబస్‌ను పునఃసమీక్షించి రాష్ట్ర సిలబస్ ను కొనసాగించాలని, విద్యాశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్‌ను తక్షణమే ఆ బాధ్యతల నుంచి తప్పించాలన్నారు. మురళీనగర్ రెసిడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సనపల వరప్రసాద్, ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీ టి.రామకృష్ణారావు, రాష్ట్ర కార్యదర్శి కోటాన శ్రీనివాసరావు, రాష్ట్ర పూర్వ కార్యదర్శి వెంకటపతిరాజు, జిల్లా కార్యదర్శి, యు.నీరజ సీహెచ్. చంద్ర కళ, జిల్లా ఉపాధ్యక్షుడు బి.ముత్యాల నాయుడు, ప్రకాష్, బి.సూర్యనారాయణ,రాష్ట్ర కౌన్సిలర్ బి.నాగభూషణం పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'విమల' ఉపాధ్యాయుల నిరసన


పాఠశాల వద్ద నినాదాలు చేస్తున్న టీచర్లు

ఉక్కునగరం: విశాఖ విమల విద్యాలయం ఉపాధ్యాయుల నిరసన కొనసాగుతోంది. తమకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. పాఠశాల కొనసాగింపుపై మూడు రోజులుగా చర్చలు కొనసాగుతున్నాయి. ఇంతకు ముందు జరిగిన చర్చల్లో ఉపాధ్యాయులు తమ డిమాండ్లను పాఠశాల యాజమాన్యం, హాజరైన పార్టీలు, కార్మిక సంఘాల నాయకులకు తెలిపారు. వారు ఉక్కు యాజమాన్యంతో చర్చిస్తామని ఉపాధ్యాయలకు హామీ ఇచ్చారు. కాగా.. ఆదివారం సెలవు అయినప్పటికీ ఉపాధ్యాయులు ఉదయం నుంచి సాయంత్రం వరకు పాఠశాల వద్ద ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేశారు.

ఆరోగ్యానికి రేడు.. నేరేడు

- పోషకాలు మెండు
- మధుమేహగ్రస్తులకు వరం నేరేడు
- మార్కెట్‌లో విరివిగా లభ్యం


నేరేడు పండ్లు విక్రయిస్తున్న వ్యాపారి

అల్లిపురం: నేరేడు పండ్లు చూస్తేనే నల్లగా నిగనిగలాడుతూ ఆకట్టుకుంటాయి. ఆ పండ్లని చాలా మంది అయిష్టంగానే చప్పరిస్తుంటారు. ఎందుకంటే వగరుగా, తియ్యగా ఉంటాయి. తిన్న తరువాత నోరంతా అదోలా పట్టేసినట్లు ఉండటంతో చాలా మంది వాటిని ఇష్టపడరు. కానీ అది ఔషధపరంగా అంతా తిని తీరాల్సిన పండు. ముఖ్యంగా మధుమేహ బాధితులకు మంచి మందు. నేరేడు పండ్లే కాదు పిక్కలు, ఆకులు, చెట్టు బెరడు కూడా ఎంతో మేలు చేస్తాయి. వాస్తవానికి ఈ పండ్లు వర్షాకాలంలో లభిస్తాయి. రామాయణంలో శ్రీ రాముడు వనవాసంలో ఉన్నప్పుడు ఎక్కువ భాగం ఈ పండ్లు తినే కాలం గడిపాడని భారతీయుల విశ్వాసం. గుజరాత్ వంటి ప్రాంతాల్లో నేరేడు పండుని దేవతా ఫలంగా భావిస్తారు. కానీ ఈ ఏడాది ఎండాకాలంలో నగరంలో విరివిగా దొరుకుతున్నాయి. కేజీ నేరేడు పండ్లు రూ.180 నుంచి రూ.200 వరకు అమ్ముతున్నారు.

ఒడిశా నుంచి దిగుమతి

తినడానికి నేరేడు పండ్లు కొంచెం తియ్యగా, కొంచెం వగరుగా ఉంటాయి. జంబూఫలం, జామూన్‌గా కూడా పిలుస్తారు. నేరేడు పండ్లను ఆయుర్వేద శాస్త్రంలో అపర సంజీవనిగా అని కూడా పిలుస్తారు. నేరేడు పండ్లలో విటమిన్ ఏ, సీ అధికంగా ఉంటాయి. నగరానికి ఇవి ఎక్కువగా ఒడిశా, రాయగడ ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటారు. వీటిలో నాటు పండ్లు కూడా ఉంటాయి. అవి వర్షాకాలంలో పక్వానికి వస్తుంటాయి. ప్రస్తుతం మార్కెట్‌లో అమ్ముతున్న పండ్లు హైబ్రీడ్ రకానికి చెందినవి. సహజ సిద్ధమైన నేరేడు పండ్లలోని ఔషధ గుణాలు పలు రకాల దీర్ఘకాలిక వ్యాధులకు మందులతో పని లేకుండా మంచి ఫలితాన్ని ఇస్తాయి. నేరేడు పండ్లను తీసుకునే వారిలో పళ్లు, చిగుళ్ల బలంగా ఉంటాయి. దీనికి రక్తాన్ని శుద్ధి చేసే శక్తి కూడా ఉంది. మొత్తంగా రోగ నిరోధక శక్తిని పెంచుతాయి. అందుకే నేరేడు శక్తి వంతమైన ఔషధఫలం.

నేరేడులో పోషక విలువలు

వంద గ్రాముల నేరేడు పండ్లలో తేమ 83.7 గ్రా, పిండి పదార్థాలు 19 గ్రా, మాంసకృత్తులు 1.3 గ్రా, కొవ్వు 0.1 గ్రా, ఖనిజాలు 0.4 గ్రా, పీచు పదార్థం 0.9 గ్రా, కాల్షియం 15.30 మి. గ్రా, ఇనుము 0.4 మి. గ్రా, సల్ఫర్ 13 మి.గ్రా, విటమిన్ సి 18.మి.గ్రాలు ఉంటాయి.

అతిగా తీసుకోవడం మంచిది కాదు

నేరేడు పండ్లు మితంగా తీసుకోవడమే మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. అతిగా తీసుకోవడం వలన సమస్యలు వస్తాయని హెచ్చరిస్తున్నారు. నేరేడు పండ్లు ఖాళీ కడుపుతో అసలు తినకూడదు. పాలు తాగిన తర్వాత తీసుకోకూడదు. తిన్న తర్వాత మంచినీళ్ల తాగకూడదు. నేరేడు పండ్లు వాత దోషాన్ని తీవ్రతరం చేస్తాయి కాబట్టి వీటిని అధికంగా తినకపోవడమే మంచిది. గ్యాస్ట్రిక్ సమస్య తలెత్తే అవకాశం ఉంది. గర్భిణులు, పాలిచ్చే తల్లులు డాక్టర్ సలహా లేకుండా తినడం మంచిదికాదు.

దివ్యాంగులతో 'తండేల్' ముచ్చట్లు


దివ్యాంగులతో ముచ్చటిస్తున్న నాగచైతన్య

కొమ్మాది: ఉమ్మడి విశాఖ జిల్లాలో 'తండేల్'సినిమా షూటింగ్ శరవేగంగా సాగుతోంది. మంగమారిపేట బీచ్, కొండకర్ల ఆవ, తంతడి బీచ్‌లో ఆదివారం ఈ సినిమా హీరో అక్కినేని నాగచైతన్య, హీరోయిన్ సాయిపల్లవిపై కొన్ని సన్నివేశాలను చిత్రీకరించారు. మత్స్యకారుల వాస్తవ సంఘటన ఆధారంగా చందు మొండేటి ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. షూటింగ్ విరామ సమయంలో నాగచైతన్య, సాయిపల్లవిలను దివ్యాంగులు కలిశారు. వారితో సుమారు 30 నిమిషాలు గడిపిన హీరో హీరోయిన్లు.. వారి యోగక్షేమాలు తెలుసుకుని, ఫొటోలు తీసుకున్నారు. గీతా ఆర్ట్స్ బ్యానర్‌పై బన్నీ వాసు నిర్మిస్తున్న ఈ సినిమాకు దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు.

అద్దాల్లో చిలుకలు


అద్దాల లోపల ఉన్న పక్షులను చూస్తున్న సందర్శకులు

- పక్షుల ఎన్‌క్లోజర్లను ఆధునికీకరిస్తున్న జూ అధికారులు
- అద్దాలు ఏర్పాటుతో కొత్తదనం


అద్దాల ఎన్‌క్లోజర్‌లో పసుపు రామ చిలుకలు


పక్షుల జోన్‌లో ఎన్‌క్లోజర్లకు అమర్చిన కూలింగ్ అద్దాలు

ఆరిలోవ: ఇందిరా గాంధీ జూ పార్కులోని పక్షుల జోన్‌లను అధికారులు ఆధునికీకరిస్తున్నారు. జూలో రెండు చోట్ల లవ్ బర్డ్స్, ఏసియన్, ఆఫ్రికన్ చిలుకల జోన్లు ఉన్నాయి. ఆధునికీకరణలో భాగంగా ఈ రెండు జోన్లలో పక్షులు ఉండే ఎన్‌క్లోజర్లకు కూలింగ్ అద్దాలు అమర్చుతున్నారు. ఆసియన్, ఆఫ్రికన్ చిలుకల జోన్‌లో ఇప్పటికే పనులు పూర్తి కాగా.. లవ్ బర్డ్స్ జోన్‌లో సగం ఎన్‌క్లోజర్లకు అద్దాలు అమర్చారు. దీంతో పక్షుల జోన్ల వద్ద కొత్తదనం సంతరించుకుంది. బయట నుంచి చూస్తున్న సందర్శకులకు అద్దాలు లోపల ఉండే పక్షులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. గతంలో ఇక్కడ సన్నని ఇనుప ఊచలతో మెస్ ఏర్పాటు చేశారు. ఆ మెస్ లోపల ఉండే పక్షులు బయట నుంచి చూసే సందర్శకులకు స్పష్టంగా కనిపించేవి కాదు. దీంతో సందర్శకులు అసంతృప్తి వ్యక్తం చేసేవారు. తాజా ఏర్పాట్లతో అద్దాల నుంచి పక్షులను చూస్తూ సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

సాగరతీరంలో 'మా నాన్నే నా హీరో'



బీచ్‌రోడ్డు: వాక్ విత్ డాడీ, డ్యాన్స్ విత్ డాడీ, డాడీ మ్యాచింగ్ అంటూ చిన్నారులు వారి నాన్నలతో సందడి చేశారు. ఫాదర్స్ డే సందర్భంగా వీరు మామ ఈవెంట్స్ ఆధ్వర్యంలో ఆదివారం సాగరతీరంలో 'మా నాన్నే నా హీరో' పేరుతో నిర్వహించిన కార్యక్రమం ఆద్యంతం ఉత్సాహంగా సాగింది. తండ్రి గొప్పతనాన్ని వివరిస్తూ పలు పోటీలు నిర్వహించారు. ఇందులో గెలిపొందిన చిన్నారులకు ప్రముఖుల చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు.

విన్యాసం.. కారాదు విషాదం!



నగరంలోని యువత ప్రమాదకరరీతిలో వాహనాలు నడుపుతూ ఆందోళన కలిగిస్తున్నారు. వేగంగా వాహనాలు నడపడం, స్టంట్స్ చేయడం, రెడ్ సిగ్నల్స్‌ను దాటుతూ ప్రమాదాలకు ఎదురెళ్తున్నారు. వీరి ప్రవర్తనతో తోటి వాహనచోదకులు, పాదచారులు భయాందోళన చెందుతున్నారు. ఏయూ ఇంజినీరింగ్ కాలేజీ రోడ్డులో ద్విచక్ర వాహనంపై విన్యాసాలు చేస్తున్న యువకులను ఈ చిత్రంలో చూడొచ్చు.

చికెన్ (కిలో)
బ్రాయిలర్ (లైవ్) : రూ.148
స్కిన్ : రూ.266
స్కిన్‌లెస్: రూ.276

'సీతారామం భజామ్యహం' పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్య కోలవెన్ను మలయవాసిని

సీతంపేట: డాక్టర్ సుసర్ల గోపాలశాస్త్రి శత జయంతి ఉత్సవాల సందర్భంగా అతని కుమారుడు సుసర్ల రామగోపాల్ రచించిన 'సీతారామం భజామ్యహం' పుస్తకావిష్కరణ సభ ఆదివారం స్థానిక పౌర గ్రంథాలయంలో జరిగింది. సహృదయ సాహితీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ జి.రఘురామారావు అధ్యక్షతన జరిగిన సభలో ప్రముఖ రచయిత్రి డాక్టర్ కోలవెన్ను మలయవాసిని ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉద్యోగ రీత్యా కెమికల్ ఇంజినీర్ అయిన రామగోపాల్ సంస్కృతం నేర్చుకుని సాహిత్యంపై పట్టు సాధించి పుస్తకాన్ని రచించారని కొనియాడారు. రామాయణంపై ఇప్పటికీ ఎంతో మంది ఎన్నో పుస్తకాలు రాశారని.. రామ గోపాల్ తనదైన శైలిలో సీతారాం భజామ్యహం పుస్తకాన్ని రాశారన్నారు. రామాయణం ఎందుకు చదవాలి? ఎందుకు గొప్పది? ఎందుకు వినాలి? అన్న ప్రశ్నలకు రామాయణంలోనే సమాధానముందన్నారు. డాక్టర్ రఘురామారావు మాట్లాడుతూ ఇరిగేషన్‌లో సివిల్ ఇంజినీర్‌గా పనిచేస్తూ సోహం సంస్థను స్థాపించి సాంస్కృతిక, సాహిత్యం కోసం అవిరళ కృషి చేసిన మహోన్నత వ్యక్తి సుసర్ల గోపాలశాస్త్రి అని అన్నారు. కళాభారతి ఆడిటోరియం, విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఏర్పాటు, సర్క్యూట్ హౌస్ కూడలిలో మాజీ ప్రధాని పి.వి.నరసింహారావు విగ్రహ స్థాపనకు సుసర్ల గోపాల శాస్త్రి ముఖ్య కారకులని గుర్తు చేశారు. పుస్తకం మొదటి ప్రతిని ప్రముఖ రచయిత బేతవోలు రామబ్రహ్మంకు రచయిత అందజేశారు. రచయిత పేరి రవికుమార్ పుస్తక సమీక్ష చేశారు. కార్యక్రమంలో పలువురు సాహితీ వేత్తలు, కవులు, రచయితలు పాల్గొన్నారు.

ఆంధ్రా టు ఒడిశా.. తాబేళ్ల అక్రమ రవాణా


అటవీ అధికారుల ఇటీవల స్వాధీనం చేసుకున్న తాబేళ్లు

రంపచోడవరం: మన రాష్ట్రం నుంచి ఒడిశాకు తాబేళ్ల అక్రమంగా రవాణా యథేచ్ఛగా సాగుతోంది. ఇక్కడ తక్కువ రేటుకు తాబేళ్లను కొనుగోలు చేసి కొంత మంది ఒడిశా ప్రాంతానికి రవాణా చేస్తున్నారు. ఒడిశా రాష్ట్రంలోని కొన్ని గ్రామాల్లో తాబేళ్లకు మంచి డిమాండ్ ఉండడంతో అంబేడ్కర్ కోనసీమ జిల్లా, పశ్చిమ గోదావరి జిల్లాలోని మంచినీటి చెరువుల్లో లభించే తాబేళ్లను కొనుగోలు చేసి గుట్టు చప్పుడు కాకుండా వాహనాల్లో రవాణా చేస్తున్నారు. అక్రమంగా రవాణా అవుతున్న తాబేళ్లను ఈ నెలలోనే రెండు సార్లు అటవీ అధికారులు పట్టుకున్నారు.

సీలేరు నది దాటించి ఒడిశా ప్రాంతంలోకి...

ఒడిశా ప్రాంతంలో బెంగాలీలు తాబేళ్ల మాంసాన్ని ఇష్టంగా తింటారు. దీంతో కొంత మంది వ్యాపారులు తాబేళ్ల రవాణాను వ్యాపారంగా మలుచుకుని ఏడాది పొడవున అటవీ శాఖ చెక్‌పోస్టుల వద్ద సిబ్బంది కళ్లుగప్పి ఒడిశా ప్రాంతానికి తరలిస్తున్నారు. గత నెల 16 తేదీన వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్న 1,589 తాబేళ్లను పోక్సుపేట రేంజ్ పరిధిలోని పోక్సుపేట అటవీశాఖ చెక్‌పోస్టు వద్ద పట్టుకున్నారు. నెల రోజుల వ్యవధిలో శుక్రవారం అక్రమంగా కారులో తరలిస్తున్న మరో 397 తాబేళ్లను పోక్సుపేట చెక్‌పోస్టు సమీపంలోని సుద్దగొమ్మి వద్ద రేంజర్ కరుణాకర్ ఆధ్వర్యంలో పట్టుకున్నారు. వారంలో మూడు నుంచి నాలుగు రోజులు తాబేళ్ల అక్రమ రవాణా జరుగుతున్నట్టు తెలుస్తోంది. కేవలం ముందస్తు సమాచారంతోనే అటవీ అధికారులు కాపు కాసి పట్టుకోగలుగుతున్నారు.ఇతర జిల్లాల్లో తాబేళ్ల అక్రమ రవాణా, కొనుగోళ్లపై అటవీ అధికారులు దృష్టి సారించకపోవడంతో అక్రమార్కులకు వరంగా మారింది. షెడ్యూల్ -1 పరిధిలోకి తాబేళ్లు రావడంతో వీటి రవాణాపై నిషేధం ఉంది. తాబేళ్ల అక్రమ రవాణాకు పాల్పడితే ఏడేళ్ల జైలు శిక్ష, జరిమానా విధించవచ్చు. కఠిన శిక్షలు ఉన్నా అమలు కావడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

రూ. 40 నుంచి రూ.50 వరకు కొనుగోలు..

అక్రమ రవాణాకు పాల్పడే వ్యాపారులు అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమ గోదావరి జిల్లాల్లో తాబేళ్లను రూ. 40 నుంచి రూ. 50 వరకు కొనుగోలు చేస్తున్నారు. వీటిని ఒడిశా ప్రాంతంలో రూ. 350 నుంచి రూ.400 వరకు విక్రయిస్తున్నారు. పలు చెక్‌పోస్టులు దాటుకుంటు తాబేళ్ల అక్రమ రవాణా జరుగుతోంది. తూర్పుగోదావరి జిల్లాలోని బూరుగుపూడి, గోకవరం, ఏజెన్సీ ముఖద్వారంలోని పోక్సుపేట,రంపచోడవరం, తులసిపాకల వద్ద చెక్‌పోస్టులున్నాయి. వాటిని దాటుకుని లక్కవరం జంక్షన్ మీదుగా గొట్లగూడెం, కొత్తపల్లి చేరుకుని దోనెలపై తాబేళ్లను సీలేరు నది దాటించి ఒడిశా ప్రాంతానికి తరలిస్తున్నారు. మరోమార్గంలో చింతూరు చేరుకుని మోటు మీదుగా ఒడిశాకు తరలిస్తున్నారు. తాబేళ్లను తరలించే క్రమంలో అనేక ఆర్థిక లావాదేవీలు జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

గట్టి నిఘా



రాజమహేంద్రవరం సర్కిల్ ఆస్మిక దళం వారు అక్రమ రవాణాను నిరోధించేందుకు ఇతర జిల్లాల డీఎఫ్‌వోలను సమన్వయ పరుచుకుని నిరోధక చర్యలు తీసుకుంటున్నారు. ఏజెన్సీలో తాబేళ్ల అక్రమ రవాణా, వన్య ప్రాణుల వేటను నిరోధించేందుకు డీఎఫ్‌వో నరేంధిరన్ ఆధ్వర్యంలో నిఘా బృందాలు పని చేస్తున్నాయి. కఠిన చర్యలతో అక్రమ రవాణాకు అడ్డుకట్టవేస్తున్నాం.

– కరుణాకర్, రేంజ్ అధికారి, పోక్సుపేట